# సత్యవాక్కు

# the word of truth

క్రైస్తవ మాసపత్రిక

NOVEMBER 1996

## సంక్షిప్త వార్తలు

1996 అక్టోబరు నెల 10వతేదీనుండి 23వ తేదీవరకు సోదరులు జాషువాగూటం గారు, అమెరికా నుండి వచ్చిన రోయస్ ఫ్రెడరిక్ గారు పలు ప్రాంతములకు పయనించి సువార్త చాటించిరి. వారు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో పర్యటించుటయే గాక, ఒరిస్సా రాష్ట్రములో కూడ పర్యటించిరి. విశాఖజిల్లాలో అనకాపల్లిలోను, విజయనగరం జిల్లాలో చోడవరం, పెదబంటుమిల్లి, గరివిడి, మెట్టపల్లి, సివలాం, చీపురుపల్లి, పార్వతీపురం, బాపూజినగర్, విక్రమపురం గ్రామాలలోను, శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, బూర్జ, నివగాం, టెక్కలి, సందూరు, పలాస గ్రామాలలోను, ఒరిస్సాలో పర్లాకిమిడి, బరంపురం, గోవిందపూర్, నహోలి, బందుగాం గ్రామములలోను సువార్త పరిచర్యచేసిరి. ఈ పర్యటనలో మొత్తం 73మంది స్త్రీ, పురుషులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

అక్టోబరు నెల సువార్తికుల సదస్సు 24వ తేదీన దేవగుప్తంలో ఘనంగా జరిగెను. ప్రశాంతమైన వాతావరణమును దేవుడనుగ్రహించగా వివిధ జిల్లాల నుండి సువార్తికులు తరలి వచ్చిరి. "యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఏల నమ్మవలెను?" అను అంశము చర్చించబడెను.

దేవగుప్తంలోనున్న క్రీస్తు సంఘము కూడుకొనుటకు నిర్మించబడిన ప్రార్థన మందిరమును సోదరులు రోయస్ ఫ్రెడరిక్ గారు, జాషువా గూటం గారు మరియు స్థానిక సువార్తికులు యన్. ఏలీయాగారు ఒకరిచేయి ఒకరు పట్టుకొని సంయుక్తముగ రిబ్బను కత్తిరించి ప్రవేశము గావించిరి. ఈ సదస్సునకు అతిథులుగా సోదరులు రోయస్ ఫ్రెడరిక్, నెహెమ్యాగూటం మరియు యన్. కె. వై. దాస్‌గారు సహవాసమందలి మాధుర్యమును పంచుకొనిరి.

ఉదయం సమావేశమునకు సోదరులు నెహెమ్యా గూటంగారు మధ్యాహ్న సమావేశమునకు సోదరులు జాషువా గూటం గారు అధ్యక్షులుగా నుండి సమర్థవంతముగ చర్చను నడిపించిరి. రోయిస్ ఫ్రెడరిక్, వి.చిన్నయ్య, పి.డి. బిషప్, పాల్‌గూటం,

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 17 నవంబరు 1996 సంచిక 4


సంపాద కీయం.

## ప్రభువు నామమును బట్టి ప్రార్ధన చేయుట

**( Calling On the Name of the Lord )**

"ప్రభువు నామమును బట్టి ప్రార్ధన చేయుట" అను బైబిలు మాటల యొక్క అర్ధము అనేకులకు తెలియదు. క్రీస్తు సంఘస్థులు ఈ మాటల యొక్క భావాన్ని యితరులకు తెలియజేయునట్లు వీటిని గ్రహించాలి. సువార్త ప్రకటింపబడాలని మనం చెబితే చాలదు. మనమే యితరులకు బోధించుట ద్వారా సువార్త చాటించాలి.

లేఖనములో ఇట్లున్నది: "యూదుడని గ్రీసు దేశస్థుడని భేదము లేదు; ఒక్క ప్రభువే అందరికి ప్రభువై యుండి, తనకు ప్రార్ధనచేయు వారందరి యెడల కృప చూపుటకు ఐశ్వర్యవంతుడై యున్నాడు. ఎందుకనగా ప్రభువు నామమును బట్టి ప్రార్ధన చేయువాడెవడో వాడు రక్షింపబడును" (రోమా 10:12,13). రక్షింపబడాలంటే ప్రజలు ప్రభువు నామమును బట్టి ప్రార్ధన చేయాలనుటలో సందేహము లేదు.

ప్రశ్నయేమంటే, ఒకడు ప్రభువు నామమును బట్టి ఎట్లు ప్రార్థన చేయును? రోమా 10వ అధ్యాయములో అపో.పౌలు ఈ దిగువ ప్రశ్నలను తరువాత వచనములో అడిగాడు: "వారు విశ్వసంపని వానికి ఎట్లు ప్రార్థన చేయుదురు? వినని వానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు?". ఈ ప్రశ్నల జవాబు విదితమే. ఒకడు సువార్తను మొదట విని విశ్వసింపని యెడల ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయలేడు.

16వ వచనములో "అయినను అందరు సువార్తకు లోబడలేదు. ప్రభువా, మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను? అని యెషయా చెప్పుచున్నాడు గదా?" అని యున్నది. ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడునని పౌలు చెప్పాడు. అట్లయినను అందరు సువార్తకు లోబడలేదని తరువాత అతడు చెప్పాడు. ఇంకోమాటలో వారందరు ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయలేదన్నమాట. గనుక ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయడం, సువార్తకు లోబడడం రెండూ ఒకటే.

ప్రభువా, ప్రభువా అని పిలిచినంత మాత్రాన ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయడం కాదని మనకు తెలుసు. ఏలయనగా, "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నాతండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" అని యేసుచెప్పెను (మత్త 7:21). దేవుని చిత్తమును జరిగించుటను గూర్చి యేసు పలుమారులు చెప్పెను. తన చిత్తమును గాక దేవుని చిత్తమును జరిగించుటకు ఆయన పరలోకమునుండి దిగివచ్చెను (యోహాను 6:38). అందువలన అందరు దేవుని చిత్తము జరిగించుటకు ఆయన చేయగలిగినదంతా చేయుట యుక్తమే. దేవుని చిత్తమును జరిగించాలంటే, ప్రభువా, ప్రభువా అని చెబితే మాత్రము చాలదని ఆయన విపులీకరించెను.

## ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయుట- బాప్తిస్మము

ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయుట, తండ్రియొక్క చిత్తము జరిగించుట ఒక్కటే. "అయినను వారందరు సువార్తకు లోబడలేదని" పౌలు చెప్పాడు. ప్రభువా మేము ప్రకటించిన సువార్తను ఎవడునమ్మెను? అని యెషయా చెప్పినప్పుడు వారందరు సువార్తకు లోబడరని అతడు చెప్పాడు. ఇక్కడ విశ్వసించుట, లోబడుట యను పదములు వాడబడెను. యివి బైబిలులో తరుచు వాడబడిన మాటలు. రోమాలో యున్న ఈ సహోదరులు వారికి అప్పగింపబడిన ఉపదేశ క్రమమునకు లోబడి పాపమునుండి విమోచింపబడిరి (రోమా 6:17,18). వారు క్రీస్తు యేసు యొక్క మరణములోనికి బాప్తిస్మము పొందిరి (రోమా 6:3,4). అందువలన రక్షింపబడు నిమిత్తము ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయుటలో వారు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. "నీవు లేచి ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసుకొనుమని" పౌలుకు కూడ చెప్పబడెను (అపొ.కా. 22:16).

"అప్పుడు ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయు వారందరును రక్షణ పొందుదురు" అని క్రైస్తవ యుగమును గూర్చి యోవేలు పలికిన మాటలను పేతురు వక్కాణించాడు (అపొ.కా. 2:21). "పేతురు-మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" యని వారికి చెప్పాడు. రక్షింపబడాలంటే ప్రతివాడు యేసుక్రీస్తు నామమునకు, లేక ఆయన అధికారమునకు విన్నవించుకోవాలి.

అపొ.కా. 2:38లో పేతురు యిచ్చిన జవాబును తిరస్కరించువాడు ప్రభువు నామమున ప్రార్థన చేయలేడు, ఏలయనగా అతడు ప్రభువు నామమును తిరస్కరించు చున్నాడు. క్రైస్తవుడు కానివాడు ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయాలంటే, అతడు ప్రభువు మీద, ఆయన అధికారము మీద ఆధారపడాలి. ఆయన చిత్తమునకు లోబడుచు తన పాపముల నుండి వైదొలగాలి, యేసే

ప్రభువని ఒప్పుకొనాలి, ప్రభువు రక్తము దరికి చేరునట్లు బాప్తిస్మము పొందాలి (రోమా 6:3,4).

క్రైస్తవులు కూడ ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయాలి. సంఘములో నున్నవారు "ప్రభువైన యేసుక్రీస్తు నామమున ప్రార్థించువారని" పౌలు చెప్పాడు (1కొరింథీ 1:2). అంటే క్రైస్తవులు క్రీస్తు నామముపై, ఆయన అధికారముపై ఆధారపడి యుండాలని యర్థము. కొలస్సయలోని క్రైస్తవులు మాటచేతగాని, క్రియచేతగాని యేమిచేసినను సమస్తమును క్రీస్తు పేరట చేయాలని పౌలు వారికి చెప్పాడు (కొలస్స 3:17). క్రైస్తవులవలె మనమేమి చేసినను సర్వాధికారియైన క్రీస్తు మాట చొప్పున చేయాలి. లేనియెడల అది క్రీస్తు పేరట చేయబడినది కాదు.

క్రైస్తవులు క్రీస్తువైపు చూచుచు, నడిపింపుకొరకు సంపూర్తిగ ఆయనపై ఆధారపడాలి. వారు ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టాలి (2కొరింథీ 10:5). తద్వారా వారు ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయు వారవుదురు.

- బేసిల్ ఓవర్టన్.

# మంచి నిర్ణయం

## ( Good Decision )

నిర్ణయమనగా ఏదైనా ఒకపనిని గూర్చి మనస్సులో నిశ్చయించు కొనుటయే. మానవుడు తీసుకొనే నిర్ణయమును బట్టి అతని భావి జీవితం ఆధారపడి ఉంటుంది. కావున నిర్ణయం తీసుకోలేని మానవుడు ఎవరూ ఉండరు. నిర్ణయం తీసుకొనక పోతే మానవుడు ఏమియూ సాధించలేడు. కాబట్టి మానవుడు తప్పని సరిగా ఏదో ఒక నిర్ణయం తీసుకుంటాడు.

మానవుడు తీసుకొనే నిర్ణయములను రెండు విధములుగా చెప్పవచ్చును.

1. మంచి నిర్ణయము, 2. చెడు నిర్ణయం.

మంచి నిర్ణయం:- ఈలోకంలో మంచినిర్ణయాలు తీసుకొన్నవారు చాలామంది ఉన్నారు. ఉదా:- మధ్యపాన నిషేధ నిర్ణయం మాజీ ముఖ్యమంత్రి N. తారక రామారావు గారు తీసికొన్నారు. ఇది మంచి నిర్ణయం. మంచి నిర్ణయాలు తీసికొని దేవుని ఆశీర్వాదాలు పొందినవారు "బైబిలు గ్రంథం" లో అనేకులు కలరు. వారిలో కొందరిని గూర్చి తెలుసుకుందాము.

దేవుడు ఇశ్రాయేలీయులను తన ప్రజలుగా ఏర్పరచు కొని మోషే తరువాత యెహోషువాను వారికి నాయకునిగా ఏర్పరచెను. యెహోషువా ఇశ్రాయేలీయుల గూర్చి బాగుగా ఎరిగినవాడై షెకెము అను ప్రాంతములో వారిని ఏర్పరచి వారి ఎదుట "నేనును నాఇంటి వారును యెహోవానే సేవించెదము" (యెహోషు 24:15) అని తన నిర్ణయము వెలిబుచ్చెను. ఇది దైవిక సంబంధమైన మంచి నిర్ణయము.

ఎజ్రాశాస్త్రి యెహోవా ధర్మశాస్త్రమును అనుసరించి నడచుకొనుటకు నిర్ణయించుకొనెను (ఎజ్రా 7:10). ఇది మంచి నిర్ణయం. మోషే అల్పకాలము పాప భోగములను అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని నిర్ణయించుకొనెను (హెబ్రీ 11:26).

షెద్రక్, మేషక్ అబెద్నెగోలు రాజు ఆజ్ఞను తిరస్కరించి మహోన్నతుడైన దేవుని స్తుతించుటకు నిర్ణయించు కొనిరి (దానియే 3:15,16). ఇది మంచి నిర్ణయం. తప్పిపోయిన కుమారుడు తన తండ్రి యొద్దనుండి తన ఆస్తిని తీసికొని దూరదేశము వెడలి తన ఆస్తినంతటిని పోగొట్టుకొనిని తరువాత తినుటకు తిండిలేని పరిస్థితిలో నాతండ్రి యొద్దకు వెళ్ళెదనని మంచి నిర్ణయమును తీసుకొన్నాడు (లూకా 15:19).

ప్రియచదువరీ! ఈలోకములో అనేక కారణముల వలన దేవుని నుండి

తప్పిపోయిన నీవు దేవుని సన్నిధికి వెళ్ళుటకు మంచి నిర్ణయమును నిర్ణయించు కొనుచున్నావా? నిర్ణయించు కొనని ఎడల ఇప్పుడే యెహోషువా వలే దేవుని సేవించుటకు నిర్ణయించుకో. తప్పిపోయిన కుమారుడు తన తండ్రి యొద్దకు వెళ్ళినట్లు దేవుని సన్నిధికి వెళ్ళుటకు నిర్ణయించుకో. షద్రక్, మేషక్, అబెద్నెగోలవలే మహోన్నతుని స్తుతించుటకు నిర్ణయించుకో. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని ఆయన వాక్యము చెప్పుచున్నది (మార్కు 16:16). కాబట్టి ఈరోజే ఆయన నామమున పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందుటకు నిర్ణయించుకో.

- పి. యస్. నారాయణ,
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్.

# సమతుల్య ఆహారము.

**( A Balanced Diet )**

మానవుడు భౌతికముగను ఆత్మీయముగాను జీవించాలంటే ఆహారము, నీరు చాలా అవుసరము. ఆత్మీయ ఆహారము భౌతిక సంబంధమైనది కాదు. యేసు జీవాహారముగను, జీవజలముగను గుర్తించబడెను (యోహాను 6:35; 4:14). ఆయన ద్వారా రక్షింపబడుటకు మరియు పోషింపబడుటకు పరలోక నిరీక్షణను కలిగి యుండుట ద్వారా మనము జీవనాధారము కల్గియుందుము.

ఆత్మీయముగా దేవుని వాక్యము ద్వారా పోషింప బడవలసిన అవసరత యున్నది. క్రీస్తు ఈవిధముగా చెప్పెను: "మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చు ప్రతీ మాటవలనను జీవించును" (మత్త 4:14). ఆయన కొండమీది ప్రసంగములో ఈవిధముగా చెప్పెను: "నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు. వారు తృప్తిపరచ బడుదురు" (మత్తయి 5:6).

దేవుని వాక్య పఠనములో మరియు ప్రసంగములు వినుటలో మనకు సమతుల్య ఆహారము కావాలి. సత్యము యొక్క ఏదో ఒక భాగముపై ఆధారపడి కొంతకాలమున్న ఎడల, ఆసమయములో ఇతర సత్యములను విడిచి పెట్టుటవలన మన ఆలోచన వక్రమార్గములో ఉండును. అది మనలను ఎదగనీయక మరుగుజ్జువానిగా చేసి, దేవునియొక్క చిత్తమును గూర్చిన ఉద్దేశములో ఒకే వైపున ఉండుటకు కారణమగును. మన ఆహారములో సమతుల్యత లేక పోయినట్లయిన అది మూఢభక్తికి, ప్రమాదమునకు, ఉదాసీనతకు మరియు ఇంకను అనేక ఆత్మీయ రోగములకు కారణమగును.

## బలమునిచ్చు ఆత్మీయాహారం

భౌతికముగా ఆరోగ్యముగా, బలముగా జీవించుటకు మనకు సమతుల ఆహారము ప్రతిరోజు అవసరము అని మనకు తెలియును. మనకు ఇష్టమైన ఆహార పదార్థములను మాత్రమే తినుట మంచిదికాదు. చిన్నపిల్లలకు, యౌవనస్థులకు వారి జీవితములో కొంతకాలము వరకు మాత్రమే పాలకు సంబంధించిన ఆహారము అవసరము కాని ఆరోగ్యముగా పెరుగుటకు బలవర్ధకమైన ఆహారము మరియు మాంసాహారరము కూడా అవసరము. అదే సూత్రము ఆత్మీయ ఎదుగుదలకు కూడా వర్తించును. అందుచే పేతురు ఈ విధముగా చెప్పెను: "క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను అపేక్షించుడి" (1పేతురు 2:2). హెబ్రీ గ్రంధకర్త మనము వాక్యమనే బలమైన ఆహారముతో బలవంతులు కావలెనని చెప్పుచున్నాడు. ఎదుగుదల లేకుండా ఆత్మీయముగా చనిపోవువారి నుద్దేశించి ఈ విధముగా చెప్పుచున్నాడు. "కాలమును బట్టి చూచితే మీరు బోధకులుగా ఉండవలసిన వారైయుండగా, దేవోక్తులలో మొదటి మూల పాఠములను ఒకడు మీకు మరలా బోధింప వలసివచ్చెను. మీరు పాలు త్రాగవలసిన వారేగాని బలమైన ఆహారము తినగల వారుకారు. మరియు పాలుత్రాగు ప్రతీవాడును శివువేగనుక నీతివాక్య

విషయములో అనుభవము లేనివాడై యున్నాడు. వయస్సు వచ్చినవారు అభ్యాసముచేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కల్గియున్నారు. కనుక బలమైన ఆహారము వారికే తగును (హెబ్రీ 5:12-14).

మనము తేలిక పాటి ఆహారముతో పాటు ఎక్కువ తీపి పదార్ధములు తినుటవల్ల అనేక సమస్యలు కల్గును. కాని కాయగూరలు, తగినంత మాంసాహారము, విటమినులు కలిగి ఇంట్లో సరిగావండిన ఆహారము అన్నివిధముల శ్రేయస్కరము.

## బలమైన జీవిత పునాది

ఆత్మీయముగా కూడా మనము సువార్తను విని అర్ధము చేసికొని యుండవచ్చు, దానిని నమ్మవచ్చు, రక్షింపబడుటకు దానిని అంగీకరించవచ్చు కాని అంతకంటే పరిపక్వత చెందక పోయినట్లయిన మనము చిక్కులలో పడుదుము. క్రైస్తవ జీవితమును మంచి బలమైన పునాదిపై కట్టవలెను. దేవుని వాక్యము, సంఘ ఆరాధనను గూర్చిన జ్ఞానమును కలిగియుండుటయే కాక విశ్వాసమును గూర్చి, ప్రార్ధన ఏలాగు పనిచేయునో మరియు క్రైస్తవ జీవితమునకు అన్వయింపబడు అనేక విషయములను గూర్చిన అవగాహన కల్గియుండవలెను.

పేతురు ఈ విధముగా చెప్పుచున్నాడు: "కాబట్టి మీరు ఈ సంగతులను తెలిసికొని మీరంగీకరించిన సత్యమందు స్థిర పరచబడి యున్నను వీటిని గూర్చి ఎల్లప్పుడును మీకు జ్ఞాపకము చేయుటకు సిద్ధముగా ఉన్నాను" (2పేతురు 1:2). మరియు ఆయన ఈలాగు చెప్పుచున్నాడు: "ప్రియులారా ఈ రెండవ పత్రిక మీకిప్పుడు వ్రాయుచున్నాను. పరిశుద్ధ ప్రవక్తల చేత పూర్వమందు పలుకబడిన మాటలను ప్రభువైన రక్షకుడు మా అపోస్తలుల ద్వారా ఇచ్చిన ఆజ్ఞను మీరు జ్ఞాపకము చేసికొనవలెనను విషయమును మీకు జ్ఞాపకము చేసి నిర్మలమైన మీ మనస్సును రేపుచున్నాను" (2పేతురు 3:1,2).

నోవహు జలప్రళయము, బానిసత్వము నుండి ఇశ్రాయేలీయులు విడిపింపబడిన విధానము, సొదొమ గొమొర్రాల నాశనము మరియు ఇతర పాత నిబంధన కథలను గూర్చి ఎన్నిసార్లు చదివియున్నారు? యేసుక్రీస్తు జీవితము మరియు మరణ, సమాధి, పునరుత్థానములను గూర్చి తెలియజేయుటకు నలుగురు రచయితలను ప్రభువు ఎన్నుకొన్నాడు. వారిలో పౌలు, పేతురు మరియు యోహాను అనేక గొప్ప సత్యములను గూర్చి అనేక పర్యాయములు వ్రాసియున్నారు.ఇట్లు తిరిగి చెప్పుటవలన మనము దేవుని గూర్చిన సత్యములను జ్ఞాపకముంచు కొనుటకు మరియు బలపడుటకు సహాయము చేయును.

## బైబిలు పఠనం అవుసరం

మన స్వంత బైబిలు పఠనము ద్వారాను లేక ప్రసంగముల ద్వారాను దేవుని రాజ్యాధికారమును గూర్చి మరియు పరలోక సౌందర్యమును గూర్చి, నరకయాతనను గూర్చి మరియు దేవుని అంగీకరించుటకు తోడ్పడు అనేక సత్యములను గూర్చి మరియు క్రైస్తవ జీవితములో మరింత ఎదుగుటకు తోడ్పడు పాఠములను వినవలసిన అవసరత యున్నది. అంతేకాక దేవుని సువార్తను, లేఖనానుసారమైన బాప్తీస్మమును గూర్చి, ఒకే సంఘమును గూర్చి, ఆరాధనలో దేవుడు కోరిన సంగీత విధానము మరియు అనేక మౌళిక సూత్రాలను గూర్చి చదువ వలసి యున్నది మరియు వినవలసి యున్నది.

మనకు మాత్రమే కాక వేరువేరు ఆత్మీయస్థాయిలో ఉన్నవారికి, వేరువేరే ఆత్మీయ అవసరతలున్న వారికి కూడా దేవుని వాక్యము బోధింపబడ వలెనను విషయములను మనము మరచి పోకూడదు.

మన సమావేశములలో చిన్నపిల్లలుంటారు, యౌవనస్థులు మరియు క్రొత్తగా క్రైస్తవులైనవారు ఉంటారు. చూడడాన్కి వచ్చిన వారుంటారు. మరియు దేవుని వాక్యమును విస్తృతమైన పరిధిలో వినుటకు వచ్చు వృద్ధులు కూడా ఉంటారు. దేవుడు ఏది చేయమని కోరుచున్నాడో ఏది చేయవద్దని కోరుచున్నాడో

మొదలగు విషయములను సులభముగా మరచి పోవు స్వభావము కలవాడు కనుక మానవునికి ఈ బోధలను మరలా మరలా బోధించాలి. సరియగు విధానములో మనము పనిచేసి నట్లయిన సంఘమునకు హాజరగువారు సత్యముచే బోధింప బడుదురు మరియు సత్యమందు ఎదుగుదురు. ఇతరులకు దేవుని వాక్యమును బోధించుటకు సంసిద్ధులవుతారు. మరియు సంఘము బలముగా ఎదుగును.

ఆలాగున జరుగక పోయినచో సంఘసభ్యులు కానివారు వచ్చునపుడు ఏమియు బోధింపబడక యుందురు. చిన్నపిల్లలు దేవుని వాక్యమును ఎరుగకయే పెద్దవారగుదురు. క్రొత్తగా వచ్చినవారు తాము ఇంతకుముందు నేర్చుకొనిన సత్యములను కూడా మరచిపోవుదురు. తియ్యని మాటలవలన మరియు చక్కనైన బోధలవలన వారు బలహీనమగుదురు మరియు సంఘము బలహీనముగా యుండును.

నా సోదరులారా! బైబిలు పఠనము ద్వారా మరియు సువార్తను బోధించుట ద్వారా తిరిగి మనము పూర్వస్థితికి తప్పని సరిగా రావలెను. ఒకే సంఘమును గూర్చిన జ్ఞానము-దేవుని వాక్యమును గూర్చిన జ్ఞానము కలిగియుండవలెను. ఆ జ్ఞానము మన ఆత్మలను పోషించును మరియు దేవుడు మనకప్పగించిన పనిని సరిగా నిర్వర్తించునట్లు చేయును. సమతుల్య ఆహారమైన దేవుని వాక్యము మాత్రమే ఆలాగు జరుగునట్లు చేయును. అపోస్తలుడైన పౌలు ఈ విధముగా ప్రోత్సహించుచున్నాడు: "తుదకు మన ప్రభువు యొక్క మహాశక్తిని బట్టి ఆయన యందు బలవంతులై యుండుడి (ఎఫెసీ 6:10).

- జె. సి. ఛోట్.

# యితరుల యెడల సరియైన భావము కలిగి యుండుట

## ( Proper Attitude toward Others )

(మత్తయి 7:1-5)

ఇంతవరకు యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగమును మత్తయి 5,6 అధ్యాయములనుండి ధ్యానించాము. ఈరోజు మత్తయి 7వ అధ్యాయములోని మొదటి అయిదు వచనములను ధ్యానించుదము. యేసుప్రభువు ఇట్లు బోధించారు: "మీరు తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మును గూర్చియు తీర్పు తీర్చబడదు. నీకంటిలో నున్న దూలము నెంచక నీ సహోదరుని కంటిలో నున్న నలుసును చూచుట యేల? నీకంటిలో దూలముండగా నీవు నీ సహోదరుని చూచి నీకంటిలో నున్న నలుసును తీసి వేయనిమ్మని చెప్పనేల? వేషధారీ, మొదట నీకంటిలో నుండిన దూలమును తీసి వేసికొనుము, అప్పుడు నీ సహోదరుని కంటిలో నున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడును" (మత్తయి 7:1-5).

మనం ఇంతవరకు చదివిన వచనములలో వర్ణించబడిన వ్యక్తికి ఒక సమస్య ఉన్నది. అయితే అతడు దానిని ఎరిగినట్లు కనబడుటలేదు. అతడు పరుల తప్పులనే ఎల్లప్పుడు ఎంచువాడు. అతడు తన తప్పుల నెరుగడు గాని యితరుల తప్పులను వెదకుతాడు, వారిపై దోషారోపణ చేస్తాడు. అతని మనస్తత్వము సరియైనదికాదు. యేసుప్రభువు అతనిని 'వేషధారి' అని పిలిచారు.

మనం మనయెడల, యితరుల యెడల కూడ సరియైన మనస్తత్వం కలిగియుండాలి. "యెహోవా, తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" అని ప్రవక్తయైన యిర్మీయా పలికాడు (యిర్మీ 10:23). మనం దేవునిచే అంగీకరింప బడాలంటే యితరుల బలహీనతలను

గూర్చి సరియైన మనస్తత్వం కలిగి యుండాలి. మనం సత్యవాక్యము విషయమై సరియైన ఆసక్తి కలిగియుండాలి. మనం బెరెయలోని క్రైస్తవుల వలె దేవుని వాక్యమును పరిశోధించాలి (అపో.కా. 17:11).

## ప్రేమ కలిగియుండాలి

సహోదరుల వలె ఒకరి యెడల ఒకరు ప్రేమ కలిగియుండాలి. "మీరు ఒకని యెడల ఒకడు ప్రేమ గలవారైన యెడల దీనిని బట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురు" అని యేసుప్రభువు చెప్పారు (యోహాను 13:35). అవిశ్వాసియైన వాడు సువార్తకు విధేయుడు కానందున నశించుపోవు స్థితిలో ఎట్లుంటాడో, క్రైస్తవుడైనవాడు తన సహోదరుని ప్రేమించనందువలన కూడ నశించిపోవు స్థితిలో యుంటాడు. ప్రభువు యొక్క బోధననుసరించి సహోదరులు ఒకరి తప్పుల నొకరు ఎంచుట మాని ఒకరి నొకరు ప్రేమించిన యెడల అనేక వాగ్వాదములు, అల్లరులు, జగడములు, విభజనలు అంతమవుతాయి. "ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసి కొనుచున్నాము. మనము కూడ సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమై యున్నాము" అని భక్తుడైన యోహాను వ్రాసెను (1యోహాను 3:16).

ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకని నొకడు పురికొల్పవలెనని" హెబ్రీ క్రైస్తవులు హెచ్చరింపబడిరి. యితరులు అవుసరములను గూర్చి ఆలోచన కలిగియుంటే వారి బలహీనతల విషయమైన సరియైన మనస్తత్వము కలిగి యుందుము. అపో.పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "కక్షచేతను వృధాతిశయము చేతనైనను ఏమియు చేయక వినయమైన మనస్సు గలవారై యొకని నొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమే గాక, యితరుల కార్యములను కూడ చూడవలెను" (ఫిలిప్పీ 2:3,4). "సహోదరులారా ఒకడు ఏ తప్పిదము లోనైనను చిక్కుకొనిన యెడల ఆత్మ సంబంధులైన మీలో ప్రతివాడు తానును

శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచి దారికి తీసికొని రావలెను" (గలతీ 6:1). ఈ వాక్యములు మన బలహీనతలను మనకు ఎల్లప్పుడు జ్ఞప్తికి తెచ్చునవై యున్నవి. యితరులకు తీర్పు తీర్చకముందు, ఈ తీర్పులో మనం ఎక్కడ నిలుచుందుమో గమనించుకొనుట మంచిది.

## కనికరము కలిగియుండాలి

యితరులను ఖండించే స్వభావముగాక వారి యెడల కనికరము కలిగి యుండాలి. యేసుప్రభువు ఆయన యొద్దకు వచ్చుచున్న జన సమూహములను చూచి, వారు కాపరిలేని గొర్రెల వలె యున్నారని వారి మీద కనికరపడెను (మత్త 9:36). దేవుని బిడ్డయైన ప్రతివాడు తన పొరుగువాని యెడల ఇట్టి స్వభావము కలిగి యుండాలి. ఏలయనగా ఈ లోకములోని ధనం అంతటికంటె ఒక ఆత్మయొక్క విలువ గొప్పది. "తుదకు మీరందరు ఏకమనస్కులై యొకరి సుఖదుఃఖముల యందు ఒకరు పాలుపడి సహోదర ప్రేమగలవారును, కరుణా చిత్తులును, వినయ మనస్కులునై యుండుడి" యని అపొ.పేతురు మనలను హెచ్చరించుచున్నాడు (1పేతురు 3:8).

తరువాత ఒకరి తప్పుల నొకరు లెక్కించుట ఒకరి నొకరు క్షమించుట నేర్చుకోవాలి. దేవుడు మన బలహీనతల నెరిగినవాడు. ఈ లోకమున్నంతకాలము మనందరికీ క్షమాపణ అవుసరమే. ఏలయనగా అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:23). యేసుప్రభువు' సిలువ మీద వ్రేలాడుచు తన శత్రువుల కొరకు సహితము ప్రార్థించారు. "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము" అని ఆయన ప్రార్థించెను (లూకా 23:34). అందువలన ప్రభువు ఇట్లు చెప్పారు: "మీ విషయమై మీరే జాగ్రత్తగా ఉండుడి. నీ సహోదరుడు తప్పిదము చేసినయెడల అతని గద్దించుము; అతడు మారుమనస్సు పొందిన యెడల అతని క్షమించుము"

(లూకా 17:3). మరల "మీకు ఒకని మీద విరోధమేమైనను కలిగియున్న యెడల మీరు నిలువబడి ప్రార్ధన చేయునప్పుడెల్ల వాని క్షమించుడి. అప్పుడు పరలోక మందున్న మీ తండ్రియు మీ పాపములు క్షమించును' (మార్కు 11:25,26).

## స్వపరీక్ష అవుసరము

మన పొరుగు వారిని నిందించుటకు ముందు మనకు మనమే స్వపరీక్ష చేసికొనవలెను. "వెలిచూపును బట్టి తీర్పు తీర్చక న్యాయమైన తీర్పు తీర్చుడని" యేసుప్రభువు చెప్పెను (యోహాను 7:24). దేవుని తీర్పు న్యాయమైనది.

మనం ఈరోజు చదువుకొనిన వాక్యభాగములో స్వనీతిపరుల యొక్క వింత స్వభావమును గూర్చి తెలియ జేయబడినది. వారు తమ తప్పుల విషయమై గ్రుడ్డివారై యుండి, ఎల్లప్పుడు యితరుల తప్పులను వెదుకుచు కుటిల వర్తనులైన వారు. తమ కంటిలో నున్న దూలము నెరుగక పరుల కంటిలో నున్న నలుసును గూర్చి ఫిర్యాదు చేయువారు. అట్టివారు వేషధారులు. స్వనీతిపరులు పలుదుష్కార్యములకు లోనగుదురు. వారిలో అసూయ, ద్వేషము, కలహము, మత్సరము మొదలగు శరీర కార్యములు ప్రత్యక్షమవుతాయి (గలతీ 5:19-21). యితరులకు తీర్పు తీర్చువాడు తన్నుతానే పైగా యుంచుకొనును. అట్లు చేసికొని తన్ను తాను మోస పుచ్చుకొనును. దేవుని వాక్యముతో గాక తన్నుతానే పోల్చుకొనుట వలన అట్టి ఆత్మవంచనకు అతడు గురియగును.

దావీదు రాజుజీవితంలో జరిగిన ఒక సంఘటనను మనం ఇప్పుడు చెప్పుకొనవచ్చును. మనతప్పులను తక్కువగా యెంచి యితరుల పొరబాట్లను గొప్పవిగా చేసిచెప్పడం మనకలవాటు. 2 సమూయేలు 11:1-27 వరకు ఉన్న వచనములలో దావీదు సంగతి మనకు కనబడును. దావీదు బత్షెబయను అందమైన స్త్రీ స్నానము చేయుట చూచి ఆమెను మోహించాడు. ఆమె ఊరియ అనునతని భార్య. అయితే ఊరియ యుద్ధములో చనిపోవునట్లు యుద్ధము

మోపుగా ఉన్నచోటను అతని దావీదు నిలబెట్టెను. ఊరియ యుద్ధములో హతమాయెను. దావీదు బత్షెబను తన నగరికి తెప్పించుకొనెను. ఆమె అతనికి భార్య ఆయెను. అయితే దావీదు చేసినది యెహోవాకు దుష్కార్యముగా నుండెను.

కావున యెహోవా ప్రవక్తయైన నాతానును దావీదు నొద్దకు పంపెను. అతడు వచ్చి దావీదుతో ఇట్లనెను. ఒక పట్టణమందొక ధనంతుడు ఒక దరిద్రుడు ఉండెను. ధనవంతునికి విస్తారమైన గొర్రెలు గొడ్లు ఉండెను. ఆదరిద్రుని దగ్గర తాను కొనుక్కొనిన ఒక చిన్న ఆడుపిల్ల తప్ప ఏమియు లేక పోయెను. అట్లుండగా మార్గస్థుడొకడు ధనవంతుని యొద్దకు వచ్చెను. ఆ ధనవంతుడు తన యొద్దనున్న వాటిని ఏమి ముట్టక ఆ దరిద్రుని గొర్రెపిల్లను పట్టుకొని తన యొద్దకు వచ్చిన వానికి ఆయత్తము చేసెను. దావీదు ఈ మాటవిని ఆ మనుష్యుని మీద బహుగా కోపించుకొని యెహోవా జీవము తోడు నిశ్చయముగా ఈ కార్యము చేసినవాడు మరణ పాత్రుడు. వాడు కనికరములేక ఈ కార్యము చేసెను గనుక ఆ గొర్రె పిల్లకు ప్రతిగా నాలుగు గొర్రెపిల్లల నియ్యవలెనని నాతానుతో అనెను. నాతాను దావీదును చూచి ఆమనుష్యుడవు నీవే యని అతనికి తెలియజెప్పెను.

దావీదు తాను చేసిన పాపమును గూర్చి ఎరిగినట్టు లేదు. అయితే కని కరము చూపని ఆ ధనవంతునిపై అతడు మండిపడెను. దావీదు వలె మనమును మన మోసకరమైన హృదయాన్ని క్రియలను కప్పిపుచ్చుకొని యితరులను ఖండించుటకు సిద్ధముగా యుందుము. అందుకే నీ కంటిలో దూలముండగా నీ సహోదరుని కంటిలో నున్న నలుసును తీసివేయనిమ్మని చెప్పనేల? వేషధారీ, మొదట నీ కంటిలో నున్న దూలమును తీసి వేసికొనుము; అప్పుడు నీ సహోదరుని కంటిలో నున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడును.

యితరులకు తీర్పు తీర్చక ముందు మనకు మనమే తీర్పు తీర్చు కొందుము గాక!

- జాషువా గూటం

# క్షమా హృదయము

**( Forgiving Heart )**

"ప్రియులారా మీకు మీరే పగతీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి - పగతీర్చుట నాపని, నేనే ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది. కాబట్టి, నీశత్రువు ఆకలిగొని యుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొని యుంటే దాహమిమ్ము; ఆలాగు చేయుట వలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు" (రోమా 12:19-21). "మీరు పరలోకమందున్న మీతండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి" (మత్త 5:44). ప్రపంచమందు ఎవరును ఎన్నడును ప్రబోధించ లేని మాటలివి. క్షమాహృదయుడైన యేసుప్రభువు తన అనుచరులకు బోధించిన ఆణిముత్యాలివి. తన జీవితంలో నెరవేర్చి చూపిన కరుణామయుని మధురమైన పలుకులివి.

యేసు అప్పగింపబడిన వెంటనే "యేసుతో కూడ ఉన్నవారిలో ఒకడు చెయ్యిచాచి కత్తిదూసి ప్రధాన యాజకుని దాసుని కొట్టి, వాని చెవి తెగనరికెను. యేసు - నాకత్తి వరలో తిరిగిపెట్టుము. కత్తి పట్టుకొను వారందరు కత్తి చేతను నశింతురు. ఈ సమయమున నేను నీ తండ్రిని వేడుకొనలేననియు, వేడుకొనిన యెడల ఆయన పండ్రెండు సేనా వ్యూహముల (72,000 యోధులు) కంటె ఎక్కువ మంది దూతలను ఇప్పుడే నాకు పంపండనియు నీవను కొనుచున్నావా? నేను వేడుకొనిన యెడల - ఈలాగు జరుగవలెనను లేఖనము ఏలాగు నెరవేరునని అతనితో చెప్పెను" (మత్త 26:51-54).

సాత్వికము బలహీనత కాదు. అది ప్రభువు యిచ్చిన బలమైన ఆయుధము. పగతీర్చుకొన గలిగే శక్తి ఉండినను, మౌనము వహించి ఆపనిని ప్రభువునకు అప్పగించుటయే సాత్వికము. క్షమాహృదయము అంటే క్షమించే మనస్సు లేనివాడు క్రైస్తవుడు కాదు. పగతీర్చుకొనుటకు ఆరాటపడువాడు ప్రకృతి సంబంధి

మరియు భౌతికవాది. "ఆ సమయమున పేతురు ఆయన యొద్దకు వచ్చి ప్రభువా, నా సహోదరుడు నాయెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మారులు అతని క్షమింప వలెను? ఏడుమారుల మట్టుకా? అని అడిగెను. అందుకు యేసు అతనితో ఇట్లనెను. ఏడు మారులు మట్టుకే కాదు, డెబ్బది ఏళ్ళ మారుల మట్టుకని నీతో చెప్పుచున్నాను " (మత్త 18:21-22).

మనం క్రీస్తు వంటి వారమని లోకము తెలిసికొనగల్గునట్లు క్షమించే మనస్సు కలిగి క్రీస్తు కల్వరి సిలువపై చూపిన ప్రేమ మాదిరి ననుసరిస్తే అనేకులు క్రీస్తు మార్గాన్ని అనుసరిస్తారు. "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను" (లూకా 23:34). ఈమాటలే కదా భూనివాసు లందరినీ క్రీస్తుసిలువ నొద్దకు ఆకర్షించుచున్న మార్గదర్శకసత్యాలు. బాప్తిస్మములో ప్రతివ్యక్తిని ఆయన మరణ, సమాధి పునరుత్థానాలలో పాలివారిని చేసి, ఆయన వారి పాపములను క్షమించి నూతన జన్మను ప్రసాదించి, ఆయన వంటి మనస్సు కలిగిన నిజ క్రైస్తవులుగ జీవించాలనేదే కదా ఆయన సంకల్పము.

అనుభవాన్ని సంవత్సరాలలో లెక్కకట్టి చెప్పడం కంటే మంచి పనులతో లెక్కకట్టి చెప్పుట హర్షణీయం. నైజీరియాలో 15 సంవత్సరాలు నూతన నిబంధన క్రైస్తవ్యాన్ని చాటించి అనేకులకు దేవుని వాక్యపు వెలుగును చూపిన సోదరులు డారెల్ ఫోల్జ్ (అమెరికా)ను నైజీరియాలో స్వార్థపరులు దోచుకొని దారుణహత్య గావించిరి. ఆయన జీవించియున్న కాలంలో యిట్లు చెప్పెను: "LIFE IS NOT MEASURED BY TIME, BUT BY DEEDS " (జీవితం కాలాన్ని బట్టికాదు, క్రియలను బట్టి పరిగణింపబడుతుంది). కష్టకాలంలో నున్న కుటుంబమునకు సోదరులు ఆదరణ కలుగజేసిరి. ఇది క్రైస్తవ్యం. క్షమాహృదయం దేవుడు మనకిచ్చిన ఆశీర్వాదం. పగ, ప్రతీకారం మానవునికి అపవాది రూపాన్ని కలుగ జేస్తుంది. క్షమించేమనస్సు క్రైస్తవునికి క్రీస్తు స్వరూపము కలుగ జేస్తుంది.

- **E.K.V.** ప్రసాదరావు, చెయ్యేరు.

# దేవునికి అనుకూలమైన జీవితము
## ( Acceptable Living )

పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును అనుభవించుచున్న ప్రజలు (ఎఫెసీ 1:3) తమ జీవితములను ప్రభువుకు ప్రీతికరముగా జీవించాలని హెచ్చరింపబడింది (ఎఫెసీ 5:10). అయితే ప్రశ్నయేమంటే దేవునికి అంగీకార యోగ్యమైనది ఆత్మమాత్రమేనా? శరీరము కాదా? పాపము, రక్షణ యనునది ఆత్మకు మాత్రమేనా? శరీరమునకు కాదా? అట్లయితే శరీరము లేకుండా దేవునికి స్తుతులు చెల్లించగలమా? శరీరము లేకుండా ప్రార్థించగలమా? శరీరము లేకుండా ప్రభురాత్రి భోజనములో పాలు పొందగలమా?

ఆత్మీయ భాగం ప్రీతికరముగా యుండాలని మనం ప్రయత్నించి నప్పుడెల్లా, శారీరక భాగం కూడా ప్రీతికరముగా యుండేటట్లు తప్పక ప్రయత్నించాలనునది నిర్వివాదం. "యెహోవా.... నానోటి మాటలును, నా హృదయ ధ్యానమును (శరీరము, ఆత్మ) నీ దృష్టికి అంగీకారములగును గాక" (కీర్తన 19:14). "నీతిమంతుని పెదవులు (శరీరముతో ఆత్మ) ఉపయుక్తమైన సంగతులు పలుకును" (సామె 10:32). "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించు కొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొను చున్నాను. ఇట్టిసేవ మీకు యుక్తమైనది" (రోమా 12:1). క్రైస్తవుని యొక్క ఆత్మ మాత్రమేకాదు, అతని శరీరము కూడ ఆత్మీయతను ధరించుకొనవలసి యున్నది. ఏలయనగా, "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకారు. విలువ పెట్టికొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి" (1కొరింధీ 6:19,20).

కొన్ని ఆచారకర్మలు జరిగించుటకు మాత్రమే మన శరీరము

ఉద్దేశించబడలేదు. గాని అది దేవునికి పరిశుద్ధమును, ప్రీతికరమునగు నంతమట్టుకు పవిత్రపరచ బడవలెను (రోమా 12:2). ఇంకో మాటలో దురలవాట్లుకు, తలంపులకు, దుష్క్రియలకు లోనై యున్న శరీరమునుండి వెలువడే పాటలను, ప్రార్ధనను, ఆరాధనను దేవుడంగీకరించడు. పాత నిబంధన కాలములో కూడ దేవుడు నిర్దోషమైన దానిని ఎన్నడు అంగీకరించలేదు (నిర్గమ 12:6; లేవీ 22:19). అందువలననే యేసుప్రభువు తన వధువైన సంఘమును (అనగా క్రైస్తవులను) కళంకమైనను, ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధ మైనదిగాను మహిమ గలదిగాను తన యెదుట నిలువ బెట్టుకొనవలెనని కాక్షించుచున్నారు (ఎఫెసీ 5:27). అప్పుడు క్రైస్తవులు క్రీస్తుయెదుట, తండ్రియైన దేవుని యెదుట, పరలోక సమూహము యెదుట చివరకు అవిశ్వాసుల యెదుట మహిమ గలవారుగా యుందురు. మనం దేవునికి ప్రీతికరముగా యున్నామని తెలిసికొనుట కంటే గొప్పదైన ఆశీర్వాదము ఇంకొకటి లేదు! మనం రక్షింపబడాలంటే దేవుని వాక్యమునకు లోబడుట మాత్రమే గాక నైతిక సద్వర్తనను కూడ కలిగి యుండాలి. ఆత్మీయతను కలిగియున్న శరీరంలో నివసించే ఆత్మ నీతికలిగి దేవుని మహిమ పరుస్తాడి. దేవునిచే అంగీకరింప బడతాడి.

– శ్యామ్ సలామ్, ఇంఫాల్, మణిపూర్.

## దైవారాధన: వాయిద్యాలు

మానవ జీవిత యాత్రలో దైవారాధన మహోన్నతమైనప్పుడు. దేవునికి, మానవునికి గల సంబంధ బాంధవ్యాన్ని తెలియజేసేదే దైవారాధన. ఆరాధన క్రమమును, దేవుడు మానవజాతికి తెలియ జేయుట గమనార్హము. దేవుని రక్షణ సంకల్ప కార్యక్రమము రెండు నిబంధనలుగా విభజింపబడి యున్నట్లు బైబిలు మనకు విశదపర్చుచున్నది. మొదటి నిబంధన కాలములో దైవారాధనకును రెండవ నిబంధన కాలములో దైవారాధనకును ఎంతో వ్యత్యాసమున్నట్లు లేఖనాలు రుజువు పర్చుచున్నవి.

మొదటి నిబంధన కాలములో హిజ్కియా యెరూషలేము నేలుచుండగా దహనబలి యర్పణ ఆరంభ మగుటతోనే బూరలు ఊదుటతోను ఇశ్రాయేలీయుల రాజైన దావీదు చేయించిన వాయిద్యములను వాయించుటతోను యెహోవాకు స్తుతిగానము ఆరంభమాయెను (2దిన 29:27). ఇట్లుండగా రెండవ నిబంధన ఆరాధన క్రమము ప్రారంభించకముందే ప్రభువు సమరయ స్త్రీతో సంభాషిస్తూ దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెననియు, యధార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చేయున్నదనియు అట్టివారే కావాలని తండ్రికోరుచున్నట్లు యేసుచెప్పెను (యోహా 4:23,24). ప్రభువు పరలోకమునకు ఎక్కి వెళ్లిపోయిన తరువాత పదియవ రోజున (పెంతెకోస్తునాడు) పరిశుద్ధాత్ముడు పరలోకమునుండి దిగి రావడం అపోస్తలులను సర్వసత్యములోనికి నడిపించడం జరిగింది. ఈ సందర్భములో దేవుని క్రమమైన నడిపింపును పరిశీలించుదము. తండ్రి చిత్తానుసారముగా కుమారుడును, కుమారుని చిత్తానుసారముగా, పరిశుద్ధాత్ముడును, పరిశుద్ధాత్ముని చిత్తానుసారముగా అపోస్తలులును అపోస్తలుల చిత్తానుసారముగా సంఘమును నడిపించబడుచున్నట్లు యోహా 16:13-15లోను అపొ.కా. 2:41, 42లో వ్రాయబడిఉన్నది.

## సంగీతము

గాత్ర సంగీతము మరియు వాయిద్య సంగీతము అని సంగీతము రెండు రకములు. నేడు ఆరాధనలో దేవుడు కోరునది గాత్రమే.

గాత్ర సంగీతము:- దేవునిచే నిర్మించబడిన మానవుడు జీవాత్మ గలవాడు. తనంతట తానుగా పాడగలడు, వ్రాయగలడు. జిహ్వాఫలమును మధురగానము ద్వారా సమర్పింపగలడు. సప్తపదద్వారముల ద్వారా సంతృప్తి నిచ్చే గానాన్ని అందించగలడు. మరియు ఆత్మతో ఆరాధించగలడు.

వాయిద్య సంగీతము:- వాయిద్య సంగీతము మానవుని చేతిపని. వాయిద్యానికి జీవాత్మలు లేవు. మాట్లాడలేదు. స్తుతించలేదు. తానంతట తానుగా ఏమియు చేయలేదు. అది "నిర్జీవ వస్తువు" (1కొరింధీ 14:7).

గనుక జీవాత్మగల మానవుడు ఆత్మతోను సత్యముతోను దేవుని ఆరాధించ గలడు. దేవుడు కోరింది కూడ అదే! వాయిద్యాలు కల్పింపబడిన పనియని ఆమోసు 6:5 వచనం దృడపర్చుచున్నది.

ప్రకటన 14:2లో వాయిద్యాలు పరలోకంలో ఉన్నట్లు చదువుచుండగా ఆరాధనలో వాయిద్యాలు వద్దంటారేమిటి? ఇదొక వాదన, గాని పొరబడుచున్నారు. విస్తారమైన జలధ్వని తోను గొప్ప ఉరుముల ధ్వనితోను సమానమైన శబ్దము అని ఉంది. ఆ శబ్దము వీణెలు వాయించుచున్న వైణికుల నాదమును పోలినది అని ఉంది. గమనించండి: "సమానమైన" "పోలిన" అనే ఈపదాలు పరలోకంలో వాయిద్యాలున్నట్లు రుజువు పర్చుటలేదు. పోల్చడం మాత్రమే జరిగింది.

ఈలోక సంబంధమైన వస్తువులు పరలోకంలో ఉండవు. ప్రకృతి సంబంధులకు ఆత్మసంబంధమైన విషయాలు అర్ధంగావు (1కొరింధీ 2:14). క్రీస్తు తన స్వరక్తమిచ్చి సంపాదించిన (అపో.కా 20:28) తన సంఘములో నుండి వేరై పోయిన అనేకులు ఆయా మత తత్వజ్ఞానమును దేవుని వాక్యముతో కలిపి చెరిపే బోధకులతో స్థాపింపబడిన సంఘాలవారు, వాయిద్యాలు వాయిస్తారు. అయితే క్రీస్తు సంఘము దేవుని క్రమమైన పద్ధతిని అనగా వాక్యమును వాక్యముతోనే సరిచూచుకొనుచు సమస్తమును క్రమముగాను మర్యాదగాను దేవుని మహిమార్థమై చేయును.

## చివరిగా

యూదులు క్రీస్తును సిలువకు మేకులతో కొట్టి చంపి అడ్డు తొలగి పోయాడనుకొన్నారు. మృత్యుంజయుడై మూడవ దినమున లేపబడగా చేసేది

ఏమిూలేక చెంపలేసు కున్నారు. రోమన్ కేథలిక్కులు (పోపులు) బైబిలును సమాధి చేద్దామనుకున్నారు. దేవుడు మార్టిన్ లూథరు ద్వారా బంధించబడి యున్న బైబిలును బయట ప్రపంచానికి బాహాటంగా అందేటట్లు చేయుట చూడగా ఆయన ఆశ్చర్యకరుడని ఆలోచన కర్తని బలవంతుడైన దేవుడని రుజువగుట లేదా? ఈలోకం క్రీస్తును జయించలేనప్పుడు ఆయన శరీరమనే సంఘాన్ని .జయించుట, అసాధ్యమని అర్ధం జేసుకోవలసి యున్నది. "పాతాళలోక ద్వారములు దాని యెదుట (క్రీస్తు సంఘము ఎదుట) నిలువ నేరవని మత్త 16:18లో వ్రాయబడి ఉంది. క్రీస్తు బోధ మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని లేఖనాను సారమైనదని జ్ఞాపకం జేయుచున్నాము. క్రీస్తు బోధకు విధేయుడవై రక్షణ నొందుము.

- కె. జార్జి, ఎ. వేమవరప్పాడు.

## వాద్య సంగీతము - అపవిత్రాత్మ

దేవునికంటే సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు క్రీస్తు బోధను పెడచెవిని బెట్టి యూదా మత సంబంధమైన వాటి యందు మిక్కిలి అభిలాషను అగుపర్చుచూ తరచు దావీదు వాయిద్యాలను ఆధారంగా తీసికొని దావీదు భక్తిగలవాడే గదా ఆయన వలె మనమును ఎందుకు వాయించకూడదు? అంటూ కొన్ని ఉదాహరణలను చూపుచుందురు. వాటిలో ఒకటి ఇక్కడ గమనించుదము.

రాజైన సౌలును దురాత్మ పట్టినప్పుడు దావీదు సితారా చేతపట్టుకొని వాయింపగా దురాత్మ అతని విడిచి పోయెను (1సమూ 16:14-23). గాన దేవుని పరిచర్యలో సితార, లేక వాయిద్య సంగీతములో ఎంతమహిమ, మహాశక్తి ఉండకుండా దురాత్మ పీడితుడు ఎంతగా సేదతీరి నెమ్మదిపొందెను? ఇప్పుడు దైవారాధనలో వాయిద్య సంగీతము వద్దంటారేమి?

జవాబు: అది అక్కడ నిజమే గాని ఇపుడు ఇక్కడ అనగా క్రీస్తునందు సితారా అక్కరలేకుండానే దురాత్మ వెళ్ళగొట్టబడెను గదా?" అపవిత్రాత్మా. ఈ మనుష్యుని విడిచి పొమ్మని వానితో చెప్పినంతలో అది విడిచి పోయెను." సితారా వీణ అక్కరలేకుండెను. క్రీస్తు మాటయేగాని సితారా కాదు.

మరియు అపొస్తలుడు పుతోను అను దయ్యముతో సితారా లేకుండ, వీణను పలికించకుండ, "నీవు ఈమెను వదలి పొమ్మని యేసుక్రీస్తు నామమున ఆజ్ఞాపించుచున్నానని ఆ దయ్యముతో చెప్పెను. వెంటనే అది ఆమెను వదలి పోయెను" (అ.కా. 16:16-18).

ఇందుమూలముగా తెలియుచున్నది ఏమనగా క్రీస్తుతో, క్రీస్తులో, క్రీస్తువారముగా జీవించుట ఆరాధించుట పూర్తిగా యూదామతమునకు, దావీదు అనుభవమునకు వేరైనదని, క్రీస్తు ఉపదేశ క్రమము మనకు నేర్పుచున్నది. క్రీస్తునందు విమోచింపబడిన వారికి క్రీస్తుబోధ సరిపడిఉన్నది.

- పాల్ గూటం, గొల్లవిల్లి.

## మీకు తెలుసా?

### ( Do You Know? )

యూరప్‌లో జరిగిన సంస్కరణ ఉద్యమములో సంస్కరణ ఉద్యమ కారులు ఆరాధలో మూడు ముఖ్యమైన మార్పులు చేసిరి.

1. కేథలిక్‌ల యొక్క పీఠములను వారు ప్రభువు బల్లలుగా (Communinon tables) మార్చిరి.

2. మత సంబంధమైన విగ్రహములను తొలగించిరి.

3. ఆర్గన్ అనువాద్యమును ఆరాధనా స్థలమునుండి తొలగించిరి.

1.“వాయిద్యములతో ప్రార్థించుట ఎట్టిదో వాయిద్యములతో పాడుటయు అట్టిదే” అని ప్రఖ్యాత బాప్టిస్టు నాయకుడు ఛార్లెస్ స్పర్జన్ చెప్పెను.

2.“నేను వృద్ధుడను, వృద్ధుడైన సువార్తికుడను. వాయిద్యములు దేవుని ఆరాధనలో మంచి జరిగించునట్లు నేనెరుగను, కాగా అనేక దుష్ఫలితాలకు అవి హేతువని నేను నమ్ముచున్నాను. సంగీతమును విజ్ఞాన శాస్త్ర సంబంధముగ అభినందితును. కాని దేవుని మందిరములో వాయిద్యములుండుట నాకు అసహ్యము నేను వాటిని ఇష్టపడను.” అని ప్రఖ్యాత మెథడిస్టు నాయకుడు ఆడమ్ క్లార్క్ చెప్పెను.

3. ఆర్గన్ “బయలు దేవతా సంకేతము” అని మార్టిన్ లూథరు చెప్పెను.

4.“ధర్మశాస్త్ర సంబంధమైన ఛాయల వలె ధూప దీపము లర్పించుట కూడ అట్టిదే” అని జాన్ కేల్విన్ చెప్పెను.

5.“పోపులు కలుషితం చేసిన క్రైస్తవ్యము పునరుద్ధరింప బడునట్లు వాయిద్యములు తొలగించి పాటలు పాడవలెను.” అని జాన్ నాక్స్ చెప్పెను.

6.“దైవారాధనలో మొదట ఎక్కడైనను గాత్ర సంబంధమైన సంగీతమే ఉండెననునది నిర్వివాదాంశము” అని ఎమిల్ నామాన్ చెప్పెను.

- ఇ .కె. వి.

వి.హిట్లర్, సి.హెచ్. వెంకట్రావ్ మరియు జామువాగూటం గార్లు పై అంశముపై చక్కని వర్తమానమును అందించిరి.

"కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను" (గలతీ 4:4). పంపినవాడు దేవుడు, పంపబడినవాడు కుమారుడు, ఆయనే క్రీస్తు. క్రీస్తు దేవుని కుమారుడు అనే సత్యాన్ని లేఖనములు స్పష్టముగ తెలియజేయుచున్నవి. పాత నిబంధనలో క్రీస్తును గూర్చి వ్రాయబడిన 330 ప్రవచనాలు, వాటి నెరవేర్పు ఆయన దేవుని కుమారుడని ఋజావు చేయుచున్నవి. ఆయన చేసిన సూచక క్రియలు, ఆశ్చర్యకరమైన ఆయనబోధలు, జ్ఞానము, ప్రేమ, మాదిరి, ఆయన సిలువ మరణము మరియు ఆయన పునరుత్థానము దేవుని కుమారుడని ఋజావు చేయుచున్నవి.

తాను తండ్రి చిత్తమును నెరవేర్చుటకు వచ్చితినని, నేను చేయు బోధ నాదికాదని చెప్పి, తండ్రిని ఘనపరచిన ఆయన కుమారుడు యేసుక్రీస్తు. తండ్రివలన పంపబడి కల్వరి సిలువపై తన రక్తమును చిందించుట ద్వారా తండ్రి ప్రేమను లోకమునకు ప్రత్యక్ష పరచిన కుమారుడు యేసుక్రీస్తు. పాత నిబంధన ప్రవక్తలు, గాబ్రియేలు, బాప్తిస్మమిచ్చు యోహాను, పేతురు, నతనయేలు, మరియు శతాధిపతి క్రీస్తు దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చిరి. దయ్యములు కూడ క్రీస్తు దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చెను (మార్కు 5:7). దేవుడు ఆయనను గూర్చి "ఈయన నా ప్రియ కుమారుడు" అని చెప్పెను (మత్తయి 3:17).

"యేసు దేవుని కుమారుడని నమ్మువాడు తప్పలోకమును జయించువాడు మరిఎవడు?" (1యోహాను 5:5). క్రైస్తవులు లోకమును జయించగల శక్తిమంతులు. లోకమును జయించ గలిగినది వారి విశ్వాసమే. సాత్వికము వారి ఆయుధము. తన స్వరక్తమిచ్చి సంఘమును సంపాదించిన క్రీస్తును దేవుని కుమారుడని విశ్వసించి, మారుమనస్సు పొంది, ఒప్పుకొని బాప్తిస్మము పొందిన యెడల ఆయన తన సంఘముతో ప్రతివారిని చేర్చును.

"ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను" (హెబ్రీ 1:2). యేసుక్రీస్తు దేవుని కుమారుడు కనుకనే అపవాది ఆదినుండి నేటివరకూ క్రైస్తవులపై దాడి చేయుచున్నది. "మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగా (ఆయన) నిరూపింపబడెను." (రోమా 1:7) "దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" (కొలస్స 2:9). ఆయన సర్వాధికారి. ఆయనకు పరలోకమందును భూమిమీదను సర్వాధికార మియ్యబడెను (మత్త 28:18). ఎందుచేతనంటే ఆయన దేవుని కుమారుడు.

రోయస్ ఫ్రెడరిక్ గారు క్రైస్తవ ప్రేమను గూర్చి, కలిసి పనిచేయుటలోనున్న ఆనందమును గూర్చి, ఐక్యతను గూర్చి, సమాధానమును గూర్చి చక్కని, క్షేమాభివృద్ధి కరమైన హెచ్చరికల నిచ్చిరి. యన్. ఏలీయాగారు స్థానిక క్రీస్తు సంఘము చక్కని ఆతిధ్యమిచ్చి సదస్సును ఘనంగా ఏర్పాటు చేసిరి. సదస్సు అనంతరము 11 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. నవంబరు నెల సదస్సు అంబాజీపేట మండలం చినలంక గ్రామములో 22వ తేదీన జరుగును. "నేడు పరిశుద్ధాత్ముడు ఎట్లు పనిచేయుచున్నాడు?" అను అంశము ఆ రోజు చర్చించబడును.

---

Regd. No. H / KD-45 / K.D. H.O
Date of Posting : 15 th of Every month

From:
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA - 533 001

To